క్లుప్తంగా

జగన్ పర్యటన జయప్రదం చేయండి

గుంతకల్లుటౌన్: రామగిరి మండలం పాపిరెడ్డి పల్లిలో ఇటీవల దారుణహత్యకు గురైన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కురుబ లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు ఈ నెల 8న వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విచ్చేయనున్నట్లు ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఖలీల్ తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి విజ్ఞప్తి మేరకు పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు 8వ తేదీ ఉదయం 9:30 గంటలకు చెన్నేకొత్తపల్లికి చేరుకోవాలని వారు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పెన్షనర్ల సంఘం సభ్యులకు సత్కారం



సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలోని పెన్షనర్ల భవనంలో ఆదివారం పెన్షనర్ల సంఘం నూతన కమిటీ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన జోజోడే ప్రభాకర్, ట్రెజరర్ ఆదిరెడ్డికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. తమపై ఉంచిన గురుతర బాధ్యతను వమ్ముచేయక పెన్షనర్ల అభ్యున్నతికి పాటుపడతామని సంఘం నూతన కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యక్తిత్వ వికాస నిపుణులు లీలా మనోహర్, పెన్షనర్ల కమిటీ సభ్యులు అల్లీపీరా, షేక్‌హుసేన్, షెక్షావలి తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నైరుతిరెడ్డి

గుంతకల్లు: స్థానిక హనుమేష్‌నగర్‌లోని మాజీ ఎమ్మెల్యే వైవీఆర్ స్వగ్రహంలో ఆదివారం త్రైత సిద్ధాంత క్యాలెండర్‌ను వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ప్రభోద సేవ సమితి కమిటీ నాయకులకు అందజేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభోదానంద స్వామి ఆశీస్సులతో ఈ ఏడాది ప్రజలందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు.

నేడు సూరేపల్లిలో జ్యోతుల మహోత్సవం

పుట్లూరు: మండలంలోని సూరేపల్లిలో సోమవారం చౌడేశ్వరీదేవి అమ్మవారి జ్యోతుల మహోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా చౌడేశ్వరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు గంగ పూజ, చెక్క భజన ఉంటుందన్నారు. అనంతరం సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకూ జ్యోతుల ఊరేగింపు చేపడతామన్నారు.

ఆటో నుంచి జారి పడి మహిళకు గాయాలు

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. వివరాలు.. కర్నూలు జిల్లా జొన్నగిరికి చెందిన లక్ష్మీదేవి అనే మహిళ పని మీద గుత్తికి వచ్చింది. పని ముగించుకుని తిరిగి జొన్నగిరికి ఆటోలో బయల్దేరింది. ఆస్పత్రి సమీపంలోఆటోకు బైక్ అడ్డు రావడంతో డ్రైవర్ సడెన్ బ్రేక్ వేశాడు. దీంతో వెనుక కూర్చొన్న లక్ష్మీదేవి కింద పడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆమెను ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వాల్మీకి విగ్రహావిష్కరణ



నార్పల: రామాయణ సృష్టికర్త వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఆదివారం మండల కేంద్రంలో వైభవంగా ఆవిష్కరించారు. దాతల సహాయంతో ఆవిష్కరించిన వాల్మీకి విగ్రహానికి అర్చకులు ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. వాల్మీకి సంఘం నాయకులు మాట్లాడుతూ వాల్మీకి మహర్షి విగ్రహాన్ని మండల కేంద్రంలో ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వాల్మీకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

శింగనమల: మండలంలోని గురుగుంట్లలో అనారోగ్యంతో చాముండేశ్వరి మృతి చెందడంతో, ఆదివారం వారి కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి వెంకటరమణ పరామర్శించారు. ఆమె భర్తకు మనోధైర్యం కల్పించి రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. వారి కుటుంబానికీ అండగా ఉంటామని, భవిష్యత్‌లో మరింత సహాయం అందిస్తామన్నారు.

శ్రీరామ.. జయరామ



తాడిపత్రిలోని బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో సీతారామస్వామి కల్యాణోత్సవం జరిపిస్తున్న అర్చకులు



శింగనమలలో రామాలయం నుంచి బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న రామభక్తులు



గుంతకల్లులో వేంకటేశ్వరస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



తాడిపత్రిలోని గన్నెవారిపల్లి కాలనీలో సీతారాముల కల్యాణోత్సవ దృశ్యం



గుంతకల్లులో కల్యాణోత్సవం తిలకిస్తున్న భక్తులు

తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో ఆదివారం శ్రీరామ నవమి పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలు రామనామంతో మార్మోగాయి. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆయా ఆలయాల్లో అర్చకులు, వేద పండితులు సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు హాజరై రాములోరి కల్యాణాన్ని కనులారా వీక్షించారు. అలాగే ఆలయాల వద్ద అన్నదానం నిర్వహించడంతోపాటు పెసరపప్పు, పానకం పంపిణీ చేశారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహాలతో ఆయా ప్రాంతాల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆలయాలకు విద్యుద్దీపాలంకరణ చేశారు.

- వైభవంగా శ్రీరామనవమి వేడుకలు
- కనుల పండువగా కల్యాణోత్సవాలు



నార్పలలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



పెద్దవడుగూరులో సీతారాముల విగ్రహాలను ఎద్ల బండిలో ఊరేగిస్తున్న భక్తులు



పామిడిలో సీతారాముల కల్యాణోత్సవంలో ఏడీసీసీ మాజీ చైర్మన్ వీరాంజనేయులు దంపతులు



గుత్తిలోని చెర్లోపల్లి కాలనీలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

సాక్షి నెట్‌వర్క్: తాడిపత్రి మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న రామాలయాల్లో రాములోరి కల్యాణం నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. రూరల్ పరిధిలోని నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్ పక్కన ఉన్న రాముని గుడి, కడప రోడ్డులో ఉన్న శ్రీ రాముల గుడి భక్తులతో కిటకిటలాడాయి. అలాగే తాడిపత్రి పట్టణంలో పార్వతీ మాత సమేత బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో సీతారామస్వామి కల్యాణోత్సవం వైభవంగా చేశారు. పంచముఖి అంజినేయస్వామి దేవాలయం, ఆత్మారామస్వామి దేవాలయం తదితర ఆలయాల్లో సీతారామస్వామి వివాహ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

- తాడిపత్రి పట్టణంలోని ఏటిగడ్డపాలెంలో ఉన్న అంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం శ్రీరామనవమిని పురస్కరించుకొని నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. రామచంద్రుడు బాలరాముడి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.
- పెద్దవడుగూరు మండలంలోని కోటకొండ, చిత్రచేడు, దిమ్మగుడి, చిన్నవడుగూరు, పెద్దవడుగూరు, క్రిష్టిపాడు, ముప్పాలగుత్తి, మల్లేనిపల్లి గ్రామాల్లో సీతారామాంజనేయ దేవాలయాలు, ఆంజనేయస్వామి దేవాలయాల్లో సీతారాములకు కల్యాణం నిర్వహించారు. గ్రామ పెద్దలు, ఆలయాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.
- యాడికి మండలంలోని తూట్రాళ్లపల్లిలో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవానికి సర్పంచు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సంజీవరాయుడు హాజరై పూజల్లో పాల్గొన్నారు. మండల కేంద్రంలో ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బొంబాయి రమేష్ నాయుడు, బాలా రమేష్ బాబుతో పాటు పలువురు ఎంపీటీసీ సభ్యులు మండల కేంద్రంలోని సీతారాముల ఆలయం, ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్లారు. రాయలచెరువు గ్రామంలో మాణిక్య సీతరామస్వామి ఆలయం, రామరాజుపల్లె కోదండ రామాలయం, పెద్దపేట సంజీవరాయుడు, చందన గ్రామంలో అభయాంజనేయ స్వామి దేవాలయాలో నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.
- గుంతకల్లు పట్టణంలోని వేంకటేశ్వరస్వామి, మోదినాబాద్ రామాలయం, కసాపురం రోడ్‌లోని త్యాగరాజు స్వామి, పాతగుంతకల్లు ఆంజనేయ స్వామి ఆలయాల్లో శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణం ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. అలాగే పీఅండ్‌టీ కాలనీలోని రుక్మిణి పాండురంగస్వామి దేవాలయం, బెంచి కొట్టాలలోని రామాలయం, పాతగుంతకల్లులోని గవివెంకటేశ్వరస్వామి ఆలయాల్లో రాములోరి కల్యాణం ఘనంగా చేశారు. అదేవిధంగా పట్టణ నడిబొడ్డున ఉన్న కోదండరామస్వామి ఆలయంలో శ్రీరామనవమి మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో ఆలయ ఈఓ మఠం మల్లికార్జున, సిబ్బంది భక్తులు, పాల్గొన్నారు.
- గుత్తి, గుత్తి ఆర్ఎస్ పట్టణాలతో పాటు జక్కల చెరువు, గొందిపల్లి, బసినేపల్లి, కొత్తపేట, ఎస్ఎస్ పల్లి లలో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గుత్తిలోని చెర్లోపల్లి కాలనీలో శ్రీ గురుపాద స్వామి , నర్సారెడ్డి, రాజ్యలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో సీతారాములు కల్యాణోత్సవం చేశారు. కోటలోని రామస్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. పై మాల వీధిలోని రామాలయంలో హరి ఆధ్వర్యంలో శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించారు. ఎస్ఎస్ పల్లిలోని రామాలయంలో సీతారాముల కల్యాణం చేశారు. గుత్తిలోని రాయల్ సర్కిల్లో శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద బలిజ సంఘం నాయకులు శ్రీరామ నవమి వేడుకలను నిర్వహించారు. జక్కల చెరువు, గొందిపల్లిలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.
- పామిడి పట్టణంలోని పామిడమ్మ వీధిలోని రామాలయంలో ఏడీసీసీ మాజీ చైర్మన్ వీరా దంపతుల ఆధ్వర్యంలో జే వెంకటేశ్వర దంపతుల సమేతంగా సీతారాముల కల్యాణోత్సవంను కనుల పండువగా నిర్వహించారు. అలాగే విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పామిడిలోని పురవీధుల్లో జై శ్రీరామ్ అంటూ భక్తులు కాషాయ జెండాలు చేతబూని బైకు ర్యాలీ చేశారు. సాయంత్రం పామిడి పెన్నానదిలోని సీతారామలక్ష్మణాంజనేయస్వామి విగ్రహాల రథోత్సవాన్ని అరిగెల వంశస్తుల ఆధ్వర్యంలో ఊరేగించారు.
- శింగనమల మండలంలో సీతారాముల కళ్యాణం , గ్రామ సంకీర్తనలు, బైక్ ర్యాలీలను జై శ్రీరాం.. జైశ్రీరాం అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. శింగనమలలో పురాతనమైన ఆత్మారామాలయంలో అభిషేకాలు నిర్వహించి, పూలతో అలంకరణ చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెస్ట్ నరసాపురం లో సీతారాముల కళ్యాణం నిర్వహించారు శివపురం, గోవిందరాయునిపేట, మట్లగొంది, సలకంచెరువు, తరిమెల, నిదనవాడ, కల్లుమడి, తదతర గ్రామాల్లో ప్రత్యేక పూజలు చేశారు.
- గార్లదిన్నె మండలంలోని కల్లూరు అగ్రహారం, కొట్టాలపల్లి, సంజీవపురం, మర్తాడు, జంబులదిన్నె, క్రిష్టాపురం, పాపినేపాళ్యంలో నవమి వేడుకలు పురస్కరించుకొని సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు.
- నార్పల మండల కేంద్రంలోని కోదండరామాలయం, అంబేడ్కర్ కాలనీలో ఉన్న సీతారాముల దేవాలయాలం, వాల్మీకి దేవాలయాల్లో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, స్వాతిలత దంపతులు కుటుంబసమేతంగా పూజా కార్యక్రమాలకు హాజరై సీతారాములకు ఘనంగా కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో ఉప సర్పంచు గవ్వల శ్రీరాములు,బాలనాగి బయన్న, చికెన్ గోపాల్, గొళ్ల సుధాకర్, పల్లె భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- బుక్కరాయసముద్రం మండలంలోని పొడరాళ్ల, రేగడి కొత్తూరు, రేకులకుంట, వడియంపేట, వెంకటాపురం, కొట్టాలపల్లిలోని రామాలయాల్లో ఆదివారం సీతారాముల కల్యాణం జరిపించారు. అనంతరం రథోత్సవాన్ని నిర్వహించారు.



గుత్తి మండలం జక్కల చెరువులో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



బీకేఎస్ మండలం కొట్టాలపల్లిలో సీతారాముల కల్యాణోత్సవ దృశ్యం



పామిడి పెన్నానదిలోని సీతారామలక్ష్మణ దేవతామూర్తుల రథోత్సవ దృశ్యం



శింగనమలలో అలంకరణలో ఆత్మాసీతారాములు



గార్లదిన్నె మండలం కొట్టాలపల్లిలో ..



పెద్దవడుగూరు మండలం ముప్పాలగుత్తిలో..



యాడికి మండలం రామరాజుపల్లిలో..



తాడిపత్రిలో బాలరాముడి అలంకరణలో శ్రీరామచంద్రుడు

తగ్గిన జీఎస్టీ వసూళ్లు!

- కూటమి ప్రభుత్వ వైఖరితో పడిపోయిన వ్యాపారాలు
- ఇబ్బందుల్లో నిర్మాణ రంగం



వాణిజ్య పన్నులశాఖ కార్యాలయం

తాడిపత్రి రూరల్: కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల వ్యాపార, వాణిజ్య, నిర్మాణ రంగం పడిపోయింది. రియల్ వ్యాపారం నేలకొరిగింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ప్రోత్సాహకాల వల్ల ఆయా రంగాలు వ్యాపార లావాదేవీలతో కళకళలాడాయి. ప్రస్తుతం వ్యాపారం లేక ఆయా రంగాలు వెలవెలబోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో తాడిపత్రి సర్కిల్‌లోని వాణిజ్య పన్నులశాఖ అధికారులు జీఎస్టీని పెంచడానికి ఇబ్బందులు పడుతున్నారు. 2023–24లో రూ.260 కోట్లు తాడిపత్రి వాణిజ్యశాఖ పరిధిలో 2023–24లో ఫిబ్రవరి వరకూ రూ.261 కోట్ల జీఎస్టీ వసూలైంది. ప్రస్తుతం అధికార లెక్కల ప్రకారం ఫిబ్రవరి నెల వరకూ రూ.231 కోట్లు వసూలైంది. ఏప్రిల్ 11లోపు వచ్చే రిటన్స్ ద్వారా రూ.29 కోట్ల అధికంగా వసూలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాడిపత్రి వాణిజ్యశాఖకు ఆదాయ వనరుగా ఉన్న పెన్నా సిమెంట్ ఫ్యాక్టరీకి సంబంధించిన రిటన్స్ సెంట్రల్ సర్కిల్‌కు వెళ్లిపోవడంతో ఇక్కడ జీఎస్టీ వసూలుకు గండి పడింది. అప్పట్లో నెలకు రూ.3 నుంచి రూ.5 కోట్ల వరకూ జీఎస్టీ వసూలయ్యేది. పెన్నా ఫ్యాక్టరీలో రెండో ప్లాంట్ రన్నింగ్‌లోకి రావడంతో ఒక్కసారిగా నెలకు జీఎస్టీ రూ.15 కోట్లకు పెరిగింది. నిబంధనల ప్రకారం ఏడాదిలో రూ.50 కోట్లు జీఎస్టీ దాటితే ఆదాయం జిల్లా కేంద్రంలోని సెంట్రల్ సర్కిల్‌కు వెళుతుంది. దీని కారణంగా 2023–24 ఆర్థిక సంవత్సరం నుంచి పెన్నా సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే జీఎస్టీ ఆదాయం సెంట్రల్‌కు వెళ్లింది. పెన్నా సిమెంట్ ఫ్యాక్టరీకి అనుబంధంగా ఉన్న హాజీబాబా ద్వారా నెలకు వచ్చే కోటి రూపాయలకు పైగా జీఎస్టీ ఆదాయం కూడా సెంట్రల్ సర్కిల్‌కు వెళ్లడం తాడిపత్రి వాణిజ్య పన్నుల శాఖ లక్ష్యానికి గండి పడింది. ప్రస్తుతం అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి నెలకు రూ. 6 కోట్లకుపైగా మొత్తంతో పాటు ఆర్జాస్ స్టీల్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే జీఎస్టీ వసూలు మాత్రమే వాణిజ్య పన్నుల శాఖకు ఆదాయ వనరుగా ఉంది.

3,400 మంది డీలర్లు

తాడిపత్రి వాణిజ్య పన్నుల శాఖ పరిధిలో 3,400 మంది డీలర్లు ఉన్నారు. ప్రధానంగా గ్రానైట్ యూనిట్లు, కడప స్లాబ్ యూనిట్లు, మిల్లులు, అన్ని రకాల వ్యాపార దుకాణాలు ఉన్నాయి. గత కొన్నేళ్లుగా ఎక్కువ ఆదాయ వనరుగా ఉన్న గ్రానైట్ యూనిట్లు ఆర్థిక సంక్షోభంతో కూరుకుపోయాయి. ఒక్కోటిగా యూనిట్లు ఇతర ప్రాంతాలకు తరలిపోగా మిగిలిన వందల సంఖ్యలో యూనిట్లు మూత పడ్డాయి. కేవలం వీటి ద్వారా వాణిజ్య పన్నుల శాఖకు దాదాపు రూ.22 కోట్ల మొండి బకాయిలు ఉన్నాయి.

రిజిస్ట్రేషన్లు పెంచిన అధికార యంత్రాంగం

తాడిపత్రి వాణిజ్య పన్నుల శాఖ అధికారులు రిజిస్ట్రేషన్ల శాతాన్ని పెంచడం కొంత వరకు ఉపశమనంగా మారింది. వివిధ వ్యాపార సంస్థలు, గ్రానైట్ యునిట్లు, కడప స్లాబ్ యునిట్లలో పలువురు యజమానులు జీఎస్టీలోకి రాకుండా వక్ర మార్గాలను ఎంచుకున్నారు. వీరి వల్ల ఆదాయానికి గండిపడుతోంది. ఈ గండిని పూడ్చడానికి వారందరితో రిజిస్ట్రేషన్‌లు చేయించి జీఎస్టీలోకి తీసుకువచ్చే ప్రయత్నం జరుగుతోంది. గతంలో ప్రతి నెలా 25 రిజిస్ట్రేషన్ల కంటే తక్కువగా జరగగా ప్రస్తుతం 30 నుంచి 35 రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారు. అధికారులు చేపట్టిన చర్యల కారణంగా గత ఏడాది అక్టోబర్ వరకూ ఆదాయం మైనస్ 15 శాతం ఉండగా మైనస్ 8 శాతానికి తగ్గింది. కాగా రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖ ఆదేశాల మేరకు స్థానిక అధికారులు అడ్వాన్స్ ట్యాక్స్ వసూలుకు ప్రయత్నిస్తుండడం వ్యాపారుల్లో గుబులు రేగుతోంది.

ఆదాయం పెంచుతాం

తాడిపత్రి వాణిజ్య పన్నుల శాఖ పరిధిలో జీఎస్టీ ఆదాయాన్ని పెంచడానికి ప్రయత్నాలు చేస్తున్నాం .గతంలో కంటే ఎక్కువ మంది వ్యాపారులతో రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నాం. వ్యాపారుల్లో జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్నాం. తాడిపత్రి ప్రాంతంలో ఎక్కడా కూడా అడ్వాన్స్ ట్యాక్స్ వసూలు చేయడం లేదు. – సురేంద్రరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్, వాణిజ్య పన్నులశాఖ, తాడిపత్రి

ఉత్సాహంగా రాతి దూలం లాగుడు పోటీలు



పెద్దవడుగూరులో రాతిదూలం లాగుతున్న దేశవు ఎద్దులు



యాడికిలో పోటీలు ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు బాలా రమేష్ బాబు

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో ఆదివారం శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకొని రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహించారు. గ్రామంలోని 10 జతల ఎద్దులు పోటీల్లో పాల్గొనగా మొదటి బహుతి యంపలాకు నాగేష్ వృషభాలు, ద్వితీయ బహుమతి రామా రమేష్ దేశవు ఎద్దులు , తృతీయ బహుమతి కుమ్మెత లక్ష్మీనారాయణరెడ్డి ఎద్దులు గెలుపొందాయి. కోడెల విభాగంలో జడ్ వీరారెడ్డి వృషభాలు ప్రథమ స్థానం , అక్కిలి నారాయణరెడ్డి(బొజ్జయ్య) ద్వితీయ స్థానం, కలగళ్ల రంగనాయకులు వృషబాలు తృతీయ స్థానం లో నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. గెలిచిన వృషభాల యజమానులకు బహుమతులను ప్రదానం చేశారు.

యాడికి: శ్రీరామ నవమి పండుగను పురష్కరించుకొని మండల కేంద్రంలో ఉన్నత పాఠశాల మైదానంలో సేద్యపు ఎద్దుల రాతి దూలం లాగు పోటీలను ఆదివారం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు బాలా రమేష్ బాబు ప్రారంబించారు. ఈ పోటీల్లో ఏడు జతల సేద్యపు ఎద్దులు పాల్గొన్నాయి. పెద్దపేట గ్రామానికి చెందిన చెన్నారెడ్డి వృషభాలు ప్రథమ బహుమతి పొందగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బాలా రమేష్ బాబు రూ.20 వేలు అందజేశారు. రెండో బహుమతి వీరన్నపల్లి చల్లా వెంకట రాముడు వృషభాలకు దాతలు బెలుం రాముడు, తోట నారాయన రెడ్డి రూ.15వేలు అందజేశారు. వీరన్నపల్లి గ్రామానికి చెందిన నాగరాజు వృషభాలకు ధృవ నారాయణ మూడో బహుమతి రూ.10 వేలు అందజేశారు. నాలుగో స్థానంలో నిలిచిన చంద్రాయునిపల్లి రామకృష్ణారెడ్డి వృషభాలకు యాడికి మండల కేంద్రానికి చెందిన విశాలాక్షి ఖాదీ సంస్థ సభ్యుడు గుండా నారాయణ స్వామి రూ.5 వేలను అందజేశారు. కార్యక్రమంలో భాస్కర్ రెడ్డి, సత్యరంగయ్య, సోమశేఖర్ రెడ్డి, రామకృష్ణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

గుంతకల్లుటౌన్/తాడిపత్రి రూరల్: బీజేపీ ఆవిర్భావ దినోత్సవం పాతగుంతకల్లు అంకాలమ్మ గుడి వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు వడ్డే రమేష్ బీజేపీ పతాకాన్ని ఎగురవేసి వందనం చేశారు. బీజేపీ నాయకులు పురంధర్, నారాయణ రెడ్డి, శివశంకర్, శ్రీదేవి, పద్మ, సతీష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే తాడిపత్రి పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ పీవీ ప్రతాప్‌రె, కర్నూలు జిల్లా ఇన్‌చార్జ్ అంకాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సింగరి లక్ష్మీనారాయణ, నియోజకవర్గ కన్వీనర్ రంగనాథరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కృష్ణమోహన్, రూరల్ అధ్యక్షుడు శేషానందరెడ్డి, రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చర్చిల్లో ఆరాధనోత్సవం

పామిడి: మండలంలోని అన్ని చర్చిల్లో ఆదివారం ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన కార్యక్రమంలో పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. సర్వలోక పాపపరిహారార్థం క్రీస్తు తన పెరలోక భాగ్యాన్ని తృణప్రాయంగా త్యజించి ఈ లోకానికి రిక్తుడిగా వచ్చారన్నారు. ఆయన మనందరి పాపాల కోసం శిలువలో తన ప్రాణం అర్పించారన్నారు. మూడో దినాన తిరిగి లేచి మనకు పునరుత్థానాన్ని అనుగ్రహించారన్నారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు పాల్గొన్నారు.